# నవకుచేలరావు–
# పాతగుడ్డల సూరమ్మల కథ

"అమ్మగారూ" అంటూ మళ్ళీ కేక పెట్టింది సూరమ్మ.

"వొస్తున్నానుండవే" అని సమాధాన మిచ్చింది వనకుశాలరావు భార్య కామాక్షి. ఆమె చాల పట్టుదలగా పాతగుడ్డ లన్నింటినీ వెదకి మరీ యివతలికి తీస్తున్నది. ఆ అలమారులో నాలుగు అరలున్నాయి. నాలుగు అరలూ నాలుగు అడవుల్లా వున్నాయి. పై అరలో ఏవేవో అర్థం పర్థంలేని పుస్తకాలూ... రెండో అరలో పాత గుడ్డలు ... మూడో అరలో పాతగుడ్డలు... క్రింది అరలో మళ్ళీ కొన్ని పుస్తకాలు, ఏవేవో కాగితాలూ, పాత ఉత్తరాలూ, శుభ లేఖలూ, చెదపురుగులూ, చిమటలూ, పగిలిపోయిన రెండు గాజు గ్లాసులూ, ఒక పింగాణీ కప్పూ, తలవిరిగిపోయిన కృష్ణుడి విగ్రహమూ, ఉన్నాయి.

కామాక్షి పాతగుడ్డ లన్నింటినీ యివతలికి తీస్తు

న్నది. సూరమ్మ ఆ చిన్న పంచలో బుట్ట పట్టుకుని కూర్చుని వుంది. కామాక్షి సంతానంలో పెద్దవాడూ, రెండోవాడూ బంతి ఆట ఆడుకుంటున్నారు. ఆ బంతి పదిరోజుల క్రితం ఎక్కడినుంచో ఎగిరివచ్చి వారిముంగిట పడింది. దాన్ని కామాక్షి వెంటనే తీసి యింట్లోదాచింది. పక్కయింటి డాబామీదినుంచి పిల్లలు వచ్చి "మా బంతి పడిందే యిక్కడ..."అంటూ వెదకుతూ వుంటే ఏమీ ఎరగని దానిలాగు "నే నిక్కడే వున్నాను. ఏ బంతీ పడలేదు. కావలిస్తే వెతుక్కోండి..." అని చెప్పింది. వాళ్ళు ఒక్క నిముషం అక్కడా యిక్కడా వెదకి వెళ్ళిపోయారు. రెండు మూడు రోజుల తర్వాత దాన్ని తీసి తన పిల్లలకు యిచ్చి "ఒరేయ్ బుద్ధిగా యింట్లోనే ఆడుకోండి, బయటికి ఆ బంతిని తీసుకుపోయారా, చంపేస్తాను." అని చెప్పింది. వాళ్ళకూ తెలుసు. బయటికి వెళ్ళి ఆడుకుంటే ఆ పక్కయింటి పిల్లలు చూస్తే, 'మాదీ యీ బంతి' అని లాక్కుంటారు.అందువల్ల వాళ్ళు లోపలే ఆడుకుంటున్నారు. మూడోది చిన్నపిల్ల, తల్లి కొంగు పుచ్చుకొనే నిలబడివుంది.

మళ్ళీ సూరమ్మ "అమ్మగారూ" అని పిలిచింది.

"ఒక్కక్షణం ఆగుమరి...చూడాలా, అక్కర్లేదా?" అంటూ కామాక్షి మరుక్షణంలో రెండు చేతులతోనూ

పాతగుడ్డలు మోపెడు మోసుకువచ్చి పంచలో ఆ పిల్ల ముందు పడేసి "చూడు" అన్నది.

సూరమ్మ ఒక్కొక్క గుడ్డనే తీసి పరిశీలించడం ప్రారంభించింది. చిరిగిన ప్యాంట్లు, చొక్కాలు, లుంగీలు, బనియన్లు, పీలికలైపోయిన చీరెలూ జాకెట్లు, పిల్లల చొక్కాలు గౌన్లు...అన్నీ వున్నాయి అందులో...

కామాక్షి జాగ్రత్తగా చూస్తూ గడపలో కూర్చుంది. సూరమ్మ ఒక్కొక్కటే చూస్తూ పక్కన పెట్టుకుంటున్నది. రెండు మూడు నిముషాల పరిశీలన తర్వాత "రూపాయి పావలా యిస్తా నమ్మగారూ!" అన్నది సూరమ్మ.

కామాక్షి బుగ్గన వ్రేలుంచుకుని "అన్ని గుడ్డలకు రూపాయి పావలాయేనా?" అన్నది ఆశ్చర్యంగా

సూరమ్మ "అంతే నమ్మగారూ! మరెక్కువైతే నాకూ గిట్టదు" అన్నది.

"అన్నీ రాళ్ళలాగున్నాయి. ఇదిగో ఈ చీరెచూడు. ఎంత జరీవుందో, మరీ అంతతక్కువ ఏమిటి?" అన్నది కామాక్షి మళ్ళీ.

"జరీ మాకెందుకమ్మగారూ! మీరే దించేసి వుంచుకోండి ... మాక్కావల్సింది పాతగుడ్డలు ... మిషన్లు, మోటార్లు, తుడుచుకునే పాతగుడ్డలు, మాకేమీ మిగలదమ్మా యిందులో" అన్నది సూరమ్మ.

కామాక్షి ఒక్కక్షణం ఆలోచించింది. స్టీలుసామాన్ల అమ్మేవాడొచ్చినప్పుడు అన్ని గుడ్డలూ వాడిముందు పడేస్తే, అన్నిచూసి వాడు చప్పరించి 'స్పూనుకూడా రాదమ్మా' అని వెళ్ళిపోయాడు. ఇప్పుడు నెమ్మదిగా బేర మాడిచూస్తే మరికొంచెం లాభం ఉండవచ్చు. అనుకుని కామాక్షి 'మరోమాట చెప్పు...' అన్నది. సూరమ్మ మళ్ళీ ఒక్కొక్క పాతగుడ్డనూ చూస్తూ "మీరెంత కిస్తారో చెప్పండి గిట్టితే తీసుకుంటాను. లేకపోతే లేదు." అంది.

అక్కడ మొదలు బేరం...కామాక్షి అధమం రెండు రూపాయలైనా లేకపోతే ఆ పాతగుడ్డలు అసలు అమ్మనన్నది. సూరమ్మ 'లాభంలేదని' లేవబోయింది. 'పోనీ రూపాయి ముప్పావలా చేసుకో.' అన్నది కామాక్షి.

సూరమ్మ తల అడ్డంగా తిప్పి "కాదమ్మగారూ! నాకేమి మిగల్దు ... ఆఖరిమాట రూపాయిన్నర. అంతకు మించి కొన్లేను." అంటూ బుట్ట తీసుకుని నిలబడింది.

"ఓసి నీ యిల్లు బంగారం గాను. అంత తొందరేమిటి సీకు? ఆగుమరి..." అంటూ కామాక్షి మెత్తబడి రూపాయన్నరకు వొప్పుకున్నది.

సూరమ్మ నసుగుతూనే కూర్చొని గుడ్డలన్నీ మళ్ళీ చూసుకొని బుట్టలో వేసుకున్నది. "మాకేమి మిగల్దండి అమ్మగారూ। ఇయన్ని ఇంతడబ్బెట్టి తీసుకపోయి మెకా

నిక్కులకు అమ్మబోతే కొండెక్కి కూకుంటారు. ఈదులన్ని తిరిగి యింత ఆయాస పడితే రాత్రికి గంజినీల్లకు కూడా రాదు. ఏం జేస్తాం ఇట్టా ఉంటాయ్ మా బ్రతుకులు."

కామాక్షికి ఆశ్చర్యంవేసింది. 'ఈ పిల్లకు పట్టుమని పన్నెండేండ్లు లేవు. ఎంత మాటకారి.' అనుకుని పైకి "నీకు అమ్మా నాన్నా పెద్ద వాళ్ళెవరూ లేరా?" అని అడిగింది.

"లేకేం అమ్మగారూ! మా అయ్యుండాడు. కాని ఏంలాభం, లేవలేడు. పాండ్రీలో కాళ్లు రెండూ పోయాయి." అన్నది సూరమ్మ డబ్బులసంచి విప్పుతూ.

"అయ్యో పాపం..." అన్నది కామాక్షి దిగులుగా ...తర్వాత ఒక గాంధీ అర్ధరూపాయిబిళ్ళ, నెహ్రూవా అర్థ రూపాయిబిళ్ళ, రెండు పావలాలు తీసుకున్నది.

సూరమ్మ బుట్టనెత్తుకొని "వొస్తానండమ్మగారూ!" అంటూ బయటికి వెళ్ళిపోయింది. మరుక్షణంలో మళ్ళీ సూరమ్మ కేక వినిపించింది. "పాత గుడ్డలు కొంటాం... పాత గుడ్డలూ..."

* * *

వసకుశాలరావు నడుస్తున్నాడు. రోడ్లన్నీ ఘోరంగా వున్నాయి. రొచ్చు రొచ్చుగా వున్నాయి. మురికి మురికిగా వున్నాయి. ముక్కులు బద్దలయ్యే పాడువాసన. రోడ్లమీద మురుగు నీళ్ళు ... మధ్య మధ్య పందులు...బజార్లనిండా

మామిడితొక్కలు ... టెంకెలూ, వాటిమీద ఈగలు...
దోమలు...

ఇవాళ ఎండ లేదు. నడివేసవి రోజులే అయినా రెండు రోజులనుంచి ఆగి ఆగి కురుస్తున్నది వర్షం. ఇక రేపటినుంచి రోళ్ళు పగిలే ఎండలు కాస్తాయి. సూర్యుడు రెండు రోజుల నుండి స్ట్రయిక్ చేస్తున్నట్టున్నాడు.

నవకుశాలరావు ఎన్. జి. వో. హోమ్ నుంచి వస్తున్నాడు. ఇప్పటివరకు అక్కడేవుండి వస్తున్నాడు. అక్కడ అంతా గొడవ గొడవగా ఆదుర్దాగా హడావిడిగా ఉన్నారు. గొప్ప టెన్షన్ మీద ఉన్నారు. ముప్పయి రోజులనుంచి సమ్మె. జీతం అయిదో పదో పెంచమని సమ్మె ... 'మా కొస్తున్న జీతాలు చాలడంలేదు. మీ శక్తిని బట్టి అయిదో పదో అయినా పెంచమని' ముప్పయి రోజులనుంచి సమ్మె. "పెంచడానికి వీల్లేదు. మీతో అసలు సంప్రదింపులు కూడ చెయ్యం." అని భీష్మించుకు కూర్చున్నది ప్రభుత్వం.

కుశాల్రావు సమ్మెలో ఉన్నాడు. ముప్పయి రోజుల నుంచి సమ్మెలో వున్నాడు. అతడు పొడుగ్గా బక్కపలుచగా వుంటాడు. అతనికి గొంతెమ్మ కోర్కెలేవీ ఎప్పుడూ లేవు. పెద్ద పెద్ద బ్యాంకు బ్యాలెన్సులుండాలనీ, తనకూ భార్యకూ పిల్లలకూ అన్నీ టెర్లిన్ దుస్తులే వుండాలని. ఇంటినిండా బంగారాలూ, ఎయిర్ కూలర్లూ, ఫ్రిజ్‌లూ ఉండాలనీ.

మూడు రోజుల కొకసారి పంచరంగుల సినిమా ఎ. సి. హాళ్ళలో చూడాలనీ, ఆ సినిమాలకు టిక్కెట్లు బుక్ చేయడానికి ఇంటో టెలిఫోన్ ఉండాలనీ ఇత్యాది కోర్కెలేవీ అతనికి లేవు.

తనకూ భార్యకూ పిల్లలకూ రెండుపూటలా ఇంత కమ్మని తిండి ఉంటే చాలనీ, మామూలు కట్టుడు బట్టలుంటే చాలుననీ, పిల్లలు మరీ మునిసిపల్ స్కూళ్ళకు వెళ్ళి చెడిపోకుండా మంచి స్కూళ్ళల్లో చదువుకుంటే చాలుననీ నెల నెలా వచ్చే జీతం తనకు బొటా బొటిగా అయినా సరిపోతే చాలుననీ, అతని ఆరాటం. అదేమి ఖర్మమో, జీతాలు ప్రభుత్వం వారు దయగలిగి చెయ్యి విదిలించినప్పుడు అయిదో పదో పెరుగుతూనే వుంటాయి. కాని, చాలడం అంటూ ఇటీవల ఎన్నడూ లేదు. 'చాలడం అంటే ఎక్కడికి? మానవుడికి తృప్తి ఎప్పుడూ వుండదు' అనే మాటలు వాదిలేద్దాం. ఫస్టు తారీకున అందే జీతం యిరవైవయ తారీకు వరకూ కనీస అవసరాలను తీరిస్తే అది గొప్ప విశేషమే. మిగిలిన పదిరోజులు చేబదుళ్లే. మొదటి తారీఖున ఈ బదుళ్ళన్నీ తీర్చేయ్యడం-మళ్ళీ ఇరవైయవ తారీఖునుంచే బదుళ్ళకు బయలుదేరడం.

"అందరూ ఎంతో కొంత పైన సంపాయిస్తూనే ఉన్నారు. వాళ్ళకేం? మాముళ్ళూ లంచాలూ లేకుండా ఏ పని జరుగుతున్నది గనుక?" అన్నారెవరో మొన్న కుశా

్రావుతో, వాళ్ళు లంచాలు పెట్టి తమ పనులు ముందు ముందుగా చేయించుకుంటూ ఉంటారేమో! కాని ఖర్మ కొద్ది కుశాల్రావు ఒక పనికిమాలిన సీటులో ఉన్నాడు. ఆ సీటులో గాడిద చాకిరి అయితే చెయ్యవలసి వుంటుందిగాని ఎప్పుడూ ఒక్కడయినా వచ్చి "అయ్యా! ఇదుగో, నా పని చేసిపెట్టండి" అని గాని, "అయ్యా! మాపని ఇతరుల పని కంటే ముందుగా చేసిపెట్టండి" అనిగాని అడిగిన పాపాన పోలేదు. అతని ముందు చూస్తేనే భయం పుట్టించే ఫైళ్ళు, వాటి నిండా గొడవ గొడవగా కరస్పాండెన్సు.తలా తోకా లేని అయోమయపు లెక్కలు! కుశాల్రావు వీలు చిక్కితే మడి గట్టుకుని కూర్చునేవాడవునో, కాదో ఊహించలేము. అతడూ మరి కేవలం సామాన్య మానవుడే కదా!

కుశాల్రావు పేరు .ఆ ఆఫీసులో ప్యూన్ దగ్గరినుంచి పైదాకా ఎవరికీ నోరు తిరుగదు. లేకపోతే తమాషా కోసమేమో అందరూ 'కుచేల్రావుగారూ!' అని పిలుస్తూ వుంటారు. అతని పేరు ఒక దశాబ్దంగా కుచేల్రావనే స్థిరపడి పోయింది.

కుచేల్రావు ఇంకా నడుస్తూనేవున్నాడు. అతనికి చాలా అకస్మాత్తుగా సిగిరెట్ కాలుద్దామని బుద్ధి పుట్టింది. ఎప్పుడో పొద్దుననగా ఎన్. జి. వో. హోమ్‌లో ఎవరి దగ్గరో అడిగి తీసుకుని ఒక సిగిరెట్ కాల్చాడు. ఇప్పుడు సిగిరెట్లు

లేవు. సిగిరెట్లు కొనలేనంత దారిద్ర్యం అనుభవిస్తున్నాడని కాదుగాని ఇప్పుడు మాత్రం అతనికి సిగిరెట్లు అరువిచ్చే దుకాణం చాలా దూరంలో ఉంది.

ఒక యింట్లో పెళ్ళి జరుగుతున్నది. చాలా అట్ట హాసంగా జరుగుతున్నది. రోడ్డుమీాదికి పెద్ద రంగు రంగుల షామియానా ఉంది. దాని క్రింద చాలా కుర్చీలున్నాయి. చాలామంది మనుషులు కోలాహలంగా మాట్లాడుకుంటు న్నారు. కుశాల్రావుకు జీవితంలో ఉన్నదొకటే రంధి; కాస్త మంచి కూడు తినాలని, కిలో ఎనభై పైసల అక్కుళ్ళ బియ్యంతో వండిన అన్నం, ఒక పచ్చడీ, చారూ, వుంటే ఒక మిల్లీ గరిటెడు నెయ్యి ఇలా కాకుండా కిలో రూపాయి పదిపైసల బియ్యంతో వండిన అన్నం వెరైటీ కోసం, రెండు కూరలు, ఏదైనా పచ్చడీ, ఒక పప్పు, కాసిని చిక్కని మజ్జిగ ఇవి వుంటే అతనికి సంపూర్ణాహారం క్రిందనే లెక్క. అతడు ఎల్లప్పుడు వొట్టి పచ్చడి మెతుకులే తింటాడని కాదు గాని అప్పుడప్పుడు తప్ప, లేకపోతే, నెల మొదటి రోజు లలో తప్ప అతడు నెలపొడుగునా తనకు నచ్చిన తిండి తిన డానికి వీలుపడదు. అతడు "మన పని యింకానయం. నెల నెలా రావల్సిన జీతం రాళ్ళు సక్రమంగా వొస్తున్నాయి. ఆ బడి పంతుళ్ళకూ, కాలేజీ మేష్టర్లకూ నెలల తరబడి జీతాలు లేవుట" అనుకున్నాడు.

ఆ ఊహతో అతనికి కొద్దిగా హుషారు వచ్చింది. ఈలవేస్తూ నడుస్తున్నాడు. అతనికో విషయం గుర్తువచ్చింది. నవ్వొచ్చింది. సంవత్సరం క్రిందట ఎప్పుడో ఒకసారి యిలాగే నమ్మె. అతడు ఒకనాడు రాత్రి తొమ్మిది గంటల వేళ ఇంటికి నడిచివెడుతున్నాడు. ఎక్కడో ఇలాగే కోలాహలంగా పెళ్ళి జరుగుతున్నది. అతడు ఏదో ఆలోచిస్తూ పది అడుగులు ముందుకుపోయి అంతలోనే మళ్ళీ వెనక్కు తిరిగి వచ్చాడు. ఆ పందిట్లో గొప్ప హడావిడి. జనం అటూ యిటూ తెగ తిరుగుతున్నారు. లోపల వడ్డన జరగబోతున్నది. కుశాల్రావు పందిట్లోకి వెళ్ళి ఒక కుర్చీలో కూర్చుని ఎదురుగా వున్న వ్యక్తిని చూసినవ్వాడు. ఆయన కూడా ప్రతిగా చిరునవ్వునవ్వాడు. ఆ ప్రక్కనే పెళ్ళికొడుకు తాలూకు మిత్రబృందం అంతా కేకలు వేస్తూ జోకులు వేస్తూ హుషారుగా నవ్వుకుంటూ ఉన్నారు. కుశాల్రావు ఎదుటి వ్యక్తితో కబుర్లలో పడ్డాడు. చాలా విషయాలు మాట్లాడాడు. ప్రపంచాన్ని ఎదుర్కొంటున్న సమస్యలను గురించి కూలంకషంగా మాట్లాడాడు. చివరకు చప్పరించి "దేశమంతా పాడైపోయింది. ఆ మాటకొస్తే ప్రపంచమే పాడైపోయింది. మళ్ళీ ఏ గాంధీయో, ఏసుక్రీస్తో, బుద్ధుడో పుట్టనిదే ప్రపంచం బాగుపడదు." అన్నాడు. "అలా తప్పక జరుగుతుంది. గీతలో పరమాత్ముడు చెప్పాడుకదా!

ప్రపంచంలో ధర్మం నశించినప్పుడు ఆయనే వస్తాడు. అంత వరకు మనలాటి వాళ్ళు ఓపిక పట్టకతప్పదు మరి" అన్నాడు. అవతలి వ్యక్తి ఉండి ఉండి "అవునవును. అంతే అంతే" అంటూ కూర్చున్నాడు. ఆ తర్వాత ఆయన లోపలికి వెళ్ళి మళ్ళీ వచ్చి "పదండి పదండి. వడ్డన అయింది. అందరూ లేవండి" అంటూ అందర్నీ కుశాల్రావుతో సహా లోపలికి తోలుకుపోయాడు. కుశాల్రావు ఒక మూలగా కూర్చుని హాయిగా భోంచేశాడు. తర్వాత కిళ్ళీ తీసుకుని వాళ్ళిచ్చిన సిగిరెట్టు కాలుస్తూ ఆ పెద్ద మనిషికి చెప్పి హాయిగా నడిచి వచ్చేశాడు. ఇప్పటికీ అది అతనికి పెద్ద నేరంగా కనిపించదు. నిజానికందులో అతని అంతరాత్మ క్షోభించ దగినంత తప్పు కూడా ఏమీ లేదు. తనేమైనా లంచాలు తిన్నాడా? మామూళ్ళు తిన్నాడా? లంచాలూ, మామూళ్ళు యివ్వ లేకపోతే బాధల్లో ఉన్న వారి పనిచెయ్యక తిప్పలు పెట్టాడా? ఏమిలేదే. అది చాలా ఆడంబరంగా జరిగిన పెళ్ళి. అటు వంటి సందర్భాలలో చాలా 'వేస్టు' అవుతూ వుంటుంది. చాలా పదార్థాలు పారెయ్యడం జరుగుతూ వుంటుంది. తాను వెళ్ళి శక్తిమేరకు 'వేస్టేజీ' తగ్గించాడు. అదేమి పాపంకాదే! అందువల్లనే అది తలుచుకున్నప్పుడల్లా అతనికి నవ్వు వస్తూవుంటుంది గాని, బాధకలగదు. పైగా ఆరోజు ఆ పెళ్ళిలో పరిచయమైన పెద్దమనిషి తనకు అప్పుడప్పుడు కనిపించినప్పుడల్లా విష్ చేస్తూ వుంటాడు. ఒకటి రెండు

సార్లు కొంచెం సేపు నిలబడి "ఎలవున్నారంటే" "ఎలావున్నా రా"ని కుశల ప్రశ్నలు వేసుకున్నారు కూడా.

రోడ్డు మలుపు తిరుగుతూ వుండగా ఒకడు కుశాల్రావు వెంటపడ్డాడు. వాడి చేతిలో ఒక అట్టవుంది. దాని మీద క్లిప్పులకు చాలా రాష్ట్రాల లాటరీ టిక్కెట్లు ఉన్నాయి. "ఒక్కటి తీసుకోండి సార్! బంపర్ ప్రైజులు... పది లక్షలు...అయిదు లక్షలు...మూడు లక్షలు. అవిగాక వేలకొద్దీ ప్రైజులు. ఇవాళే డ్రా. రేపు పేపర్లో ఫలితాలు." అంటూ తగులుకున్నాడు వాడు.

"వొద్దయ్యా బాబూ! నేనింతకు మునుపే కొన్నాను." అని కుశాల్రావు వాణ్ణి వదిలించుకుని ముందుకు నడిచాడు.

ఆమాట నిజమే. వారం రోజుల క్రిందట అతను ఒక లాటరీ టిక్కెట్టుకొన్నాడు. రెండు రూపాయలు పెట్టి మరీ కొన్నాడు. ఆ రెండు రూపాయలు అతనికి చాలా తమాషాగా లభించాయి. ఒక కొలిగ్‌తో ఒక చిన్న విషయంలో పందెంకట్టి నెగ్గాడు. ఇద్దరు పెద్ద సినిమా నటులున్నారు. వారిద్దరికీ వైరమనీ, ఒకరంటే ఒకరికి బొత్తిగా సరిపడదనీ సాధారణాభిప్రాయం. ఒక నటుడి యింట్లో పెళ్లికి రెండో నటుడు వెళ్ళలేదనీ, అందువల్ల రెండో నటుడి యింటో పెళ్ళికి మొదటి నటుడు వెళ్ళడనీ అతని కొలిగ్ వాదించాడు. కుశాల్రావు ఏమీ తోచక "వెళ్తాడు తప్పకుండా

వెళ్తాడు" అని వూరుకున్నాడు. "వెళ్ళడు. కావలిస్తే పందెం కడతాను" అన్నాడు అవతలి వ్యక్తి. "సరే కట్టు" అన్నాడు కుశాల్రావు. రెండు రూపాయలు పందెం కట్టుకున్నారు. కుశాల్రావుకు నిజానికీ విషయాలేవీ తెలియవు. ఆ భరోసాతోనే అవతలి వ్యక్తి పందెం కట్టాడు. కాని చిత్రంగా కుశాల్రావుమాటే నెగ్గింది రెండో నటుడి యింట్లో పెళ్ళికి మొదటి నటుడు వెళ్ళనే వెళ్ళాడు. అందువల్ల కుశాల్రావు నెగ్గాడు. రెండు రూపాయలు చేతిలో పడినై. అది పెట్టి యింటికి మామిడి పళ్లు కొనుక్కుపోతే బాగుండుననిపించింది. కాని ఆరోజు యిలాగే లాటరీ టిక్కెట్లు అమ్మే వాడొకడు వెంటబడి ప్రాణాలు తీశాడు. 'లక్షలు లక్షల'ని ఊరికే రొద పెట్టాడు. కుశాల్రావు తప్పనిసరి అయి ఒక టిక్కెట్టు కొన్నాడు.

"అన్నట్టు ఆ లాటరీ టిక్కెట్టు ఎక్కడ పెట్టానబ్బా!" అని ఆలోచనలో పడ్డాడు కుశాల్రావు. ఇంటి గుమ్మం మెట్లు ఎక్కేవరకూ అతనికి ఆ విషయం గుర్తురాలేదు. అంతలో మెరుపులాగా గుర్తు వచ్చింది. దాన్ని అతడానాడు ఆ పైజమా జేబులో నుంచి యివతలికి తీయలేదు. అలాగే ఉంచి దాని విషయమే మరిచిపోయాడు.

అతడు త్వర త్వరగా లోపలికి వెళ్ళి "కాముడూ" అని కేక వేస్తూ వాంకెలన్నీ పరీక్షించాడు. తర్వాత అల మారు తలుపులు తెరిచాడు.

కామాక్షి "ఏమిటండీ?" అంటూ చేతులు చీరె కొంగుకు తుడుచుకుంటూ వచ్చింది.

"నా పైజామా ఏదీ! అసలీ గుడ్డలన్నీ ఏమైనాయి?" అని అడిగాడు కుశాల్రావు.

కామాక్షి నవ్వుతూ "ఎందుకవన్నీ యింట్లో? అల మారు తెరిస్తేచాలు. అసహ్యంగా అన్నీ పాతగుడ్డలు, చిరాకు పుట్టి అన్నీ అమ్మేశాను" అన్నది.

"ఆ పైజమా కూడానా?"

"ఆఁ-అదికూడా చిరుగులు పట్టిందిగా. మీరు మళ్ళీ తొడుక్కుంటారా ఏమన్నానా?"

"చంపేశావు. ఆ జేబులో లాటరీ టిక్కెట్టు పెట్టాను. చూడకుండా యిచ్చేశావా?"

కామాక్షి ఆశ్చర్యపోయింది. "ఆ పైజమా జేబులో లాటరీ టిక్కెట్టు పెట్టారా ? నేను చూడనేలేదే. అయినా అదేం చోద్యమండీ. దాన్ని ఎక్కడన్నా గుర్తుగా పెట్టు కుంటారుగాని, అయ్యయ్యో! ఎంత పని జరిగింది!"

కుశాల్రావు చిరాగ్గా లోపలికి తొంగి చూశాడు. లోపల తన కిష్టమైన నవ నవ లాడే వంకాయలు నీలంగా ... తాజాగా, అద్భుతంగా కనిపించాయి. అతడంతలో చొక్కా విప్పుతూ "సర్లే. వెధవ లాటరీ టిక్కెట్టు పోతే

పోయిందిలే, అయినా మనకేమన్నా రాబోతున్నదా ఏమ న్నానా? అవన్నీ ఏ ప్యూనులకో, రిక్షావాళ్ళకో తగు ల్తాయి. మనకురావు. లక్షలు కోట్లలో ఒక ప్రయిజు మన కొస్తుందని నమ్మకం ఏమిటి? పోన్లే నువ్వేం బాధపడకు - అన్నట్టు వంకాయలు చాలా బాగున్నాయ్! ఎక్కడ తెప్పిం చావు? నా మాట విని వాటిని మామూలుగా తరక్కు. అలాగే కాయలు కాయలుగా గుత్తి వంకాయ చెయ్యి. నువ్వు చేస్తే మరి తిరుగుండదు." అంటూ అంతలోనే గుత్తి వంకాయ కూరోయి మామా! కోరివండి నానోయి మామా" అని రాగం తీయడం ప్రారంభించాడు. ఒకసారి "మాఁవా" అని మరొకసారి "బావా" అని మార్చి మార్చి పాడుతూ అటూ యిటూ తిరిగాడు.

కామాక్షి "అలాగే మీరు చెప్పినట్టే చేస్తాను. ముందు స్నానం చేసిరండి. అయ్యొయ్యో! మతిమాలినదాన్ని శాస్త్ర చూసి మరీ గుడ్డలు ఆపిల్లదానిముందు పడేసి ఉండా ల్సింది. ఏ ప్రయిజూరాదు లెమ్మని సరిపుచ్చుకుంటే పోతుందా? సంగతి ఏదో తేలేదాకా దానివిలువ దానిదే ...'ఏ పుట్టలో ఏపామున్నదో' అంటారు. ఎంతపొరపాటు చేశాను" అని బాధపడుతూనేవుంది.

ఆమె వంటచేస్తున్నంతసేపూ. ఆ తర్వాత కూడా నొచ్చుకుంటూనే వుంది. మధ్య మధ్య "మీరు మరీ అమో

మయం మనుష్యులై పోతున్నారు. ఆ టిక్కెట్టు సంగతి కాస్త నా చెవిని పడేసివుంటే ఇంతగొడవ ఉండేదికాదు.” అంటూనే వుంది.

కుశాల్రావు ఆమె వంటచేస్తున్నంత సేపూ, ఆ తర్వాతా పిల్లలతో కూర్చుని భోంచేస్తూ కూడా ఆమెకు నచ్చజెబుతూనే వున్నాడు. “మనకలాంటివిరావే ... ఊరికే బాధపడకు.’ అని సర్దుతూనేవున్నాడు.

అయినా కామాక్షి భోజనాల తర్వాత కొంగు పరుచుకుని నడుంవాలుస్తూ కూడా “ప్చ్.” ఎంత పొరపాటు జరిగిపోయింది.” అని అనుకుంటూనేవుంది.

* * *

మరునాడు...

సూరమ్మ గుడిసెలో తండ్రిమంచం ప్రక్కన పాత గుడ్డల పోగుముందు కూర్చుని ఒక్కొక్కదాన్నే తీసి చించి పోగులు పెడుతున్నది. చిన్న చిన్న మూటలు కడుతున్నది. పావలాకు నాలుగు మూటలు. కొందరు పాత మెకానిక్కులకు కాతాగా వేసేచోట పావలాకు అయిదు. వాటిని వర్క్ షాపులలో, మోటారుసైకిల్లు బాగుచేసే మెకానిక్కుల దగ్గరా అమ్ముతూ వుంటుంది.

ఆపిల్ల తండ్రి వెంకడు కుంటివాడు. నులకమంచంలో

పడుకుని ఉన్నాడు. కళ్ళు తెరుచుకుని గుడిసె పై కప్పులో రంధ్రం పడ్డచోట చూస్తున్నాడు.

అతడు ఉన్నట్టుండి కూతురివంక తిరిగి "అమ్మలూ! డబ్బులేమన్నా ఉన్నాయా?" అని అడిగాడు.

సూరమ్మ తల ఆడించి "ఏమో! సూడాలి... అయిదు పైసలో ఆరుపైసలో ఉంటాయ్... ఏం... ఎందుకు?" అని అడిగింది.

"సర్లేపోసే" అని ఊరుకున్నాడు.

"ఏం. ఎందుకు?" అని మళ్ళీ అడిగింది సూరమ్మ.

వెంకడు పక్కకు ఒత్తిగిలి "ఏంలేదే. ఇయాళ పండు కప్ప ... ఉప్పుది ... తెస్తావేమో అని... అయినా డబ్బు ల్యేవ్వుగా" అన్నాడు నెమ్మదిగా.

సూరమ్మ గుడ్డలు పరపర చింపుతూనే "డబ్బు లైవ్వు" అన్నది. తండ్రికి పండుకప్ప అంటే యిష్టమని ఆ పిల్లకు తెలుసు. తండ్రి అంతకంటె ఏమీ కోరడుకూడా... కాని డబ్బులు...?.

సూరమ్మ కసిగా గుడ్డలు చింపసాగింది. చించిపోగులు పెట్టింది. ఇదేదో చీరె...రంగు కొత్తలో ఎంత బాగుండేదో ...చీరె చిరిగిపోయినా రంగుమాత్రం పోలేదు. కొన్ని అట్లా కాదు. ముందు రంగేపోతుంది. ఇది బనీను. ఇది పైజమా.

పైజమా జేబులో ఏదో కాగితం తగిలింది. సూరమ్మ పసిమెదడులో రూపాయి కాయితమో, రెండురూపాయల కాయితమో... మెరుపులా మెరిసింది. దాన్ని నింపాదిగా యివతలికి తీసింది. అదేదో రంగురంగుల లాటరీ టిక్కెట్టు. సూరమ్మ నిరుత్సాహంగా "సరే" అనుకుని నిట్టూర్చి అవతల పడేసి దానిమీద బరువుంచి ఊరుకుంది. తర్వాత తన పనిలో దీక్షగా మునిగిపోయింది. గుడ్డలన్నీ చించి పోగులు పెట్టి సమంగా కట్టలు కట్టడం పూర్తి అయిన తర్వాత "ఇప్పుడే వొస్తా" అని తండ్రికి చెప్పి బైటికి రాబోయి మళ్ళీ అంతలో వెనక్కు వెళ్ళి ఆ లాటరీ టిక్కెట్టు అందుకుని గుడిసె తడికె దగ్గరికి లాగి ఇవతలికి వచ్చింది.

ముందు ఒక మెకానిక్కు దగ్గరికి వెళ్ళి నిలబడింది. అతడు చాలా దీక్షగా ఒక బుల్లెట్ బాగుచేస్తూ సూరమ్మ వంక తిరిగి "ఏం పిల్లా ఇట్టావచ్చావు?" అని అడిగాడు.

సూరమ్మ నసుగుతూ "నిన్న గుడ్డలిచ్చాను. పావలా రావాలి." అన్నది.

"నిన్నయిచ్చి అప్పుడే డబ్బులకోస మొచ్చావా?" అంటూనే అతడు లేచి మాసిన చేతిని జేబులోదోపి పావలాకాసు తీసి సూరమ్మ చేతిలో పడేసి మళ్ళీ బండి ముందు కూర్చున్నాడు.

సూరమ్మ మెల్లిగా "ఇంకో పావలా ఇయ్యండి. కావాలి ...సాయంకాలం గుడ్డలు తెచ్చిస్తాను." అన్నది.

"లేవు...సాయంకాలం ఇస్తాలే...పో..." అన్నాడతడు పనిలో ఉండి.

సూరమ్మకు ఇంక ఎవరూ డబ్బులివ్వనక్కర లేదు. పావలా కాసు కాసు గుడ్డసంచీలో పడేసుకుని బొడ్లో దోపుకుని బయలుదేరింది.

నిన్నటిదాకా వాన....ముసురు...ఇవాళ ఎండ ... ఎండ ... ఎండ ... నిప్పులు చెరుగుతున్నది సూర్యబింబం, ఎక్కడా గాలి లేదు.

సూరమ్మ ఆ యింటి ముందు ఆగి "అమ్మగారూ!" అని పిలిచింది. కుశాల్రావు అప్పుడే పక్క యింటి నుంచి పేపరు తెప్పించుకుని చూస్తున్నాడు. మొదటి పేజీనిండా రాజకీయాలు. ఉపన్యాసాలు, సమ్మె పరిస్థితిలో మార్పు లేదు. రెండో పేజీలో సగం వరకూ లాటరీ ఫలితాలు. మొదటి ప్రయిజు పది లక్షలు ఫలానా నంబరు. రెండో ప్రయిజు అయిదు లక్షలు ఫలానా నెంబరు. మూడో ప్రయిజు మూడు లక్షలు ఫలానా నెంబరు. ఇప్పటికి రెండు వందల పాతికమంది లక్షాధికారు లయ్యారట. అతని దగ్గర ఉన్న టికట్టు కూడా చేజారిపోయింది.

"అయినా, మనందాన్ని కష్టార్జితం పెట్టికొన్నాం గనుకనా? ఎలా వచ్చింది. అలాగేపోయింది." అనుకున్నాడతడు.

మళ్ళీ వాకిట్లో "అమ్మగారూ" అని కేక.

కుశాల్రావు పేపరు చూస్తూనే "చూడవే కాముడూ! ఎవరో పిలుస్తున్నట్టున్నారు." అన్నాడు.

కామాక్షి "ఎవరూ?" అంటూ తలుపు తెరిచింది. సూరమ్మ పంచలోకి వచ్చి "మీరు గుడ్డలిచ్చారుగా అమ్మగారూ! అందులో జేబులో దొరికిందిది." అంటూ ఆమె చేతికి ఆలాటరీ టిక్కెట్టు ఇచ్చింది. కామాక్షి కొద్దిగా ఆశ్చర్యపోయి "అవునమ్మాయ్! ఎంతో అనుకున్నాం కూడా ... మంచిదానివే ... పాపం ... దీనికోసం ఎండలోపడి వొచ్చావు. మంచినీళ్ళు కావాలా?" అన్నది.

కుశాల్రావు హడావిడిగా ఒక గెంతులో లేచి "ఏదీ" మనలాటరీ టిక్కెట్టేనా? త్వరగా ఇలా ఇవ్వు" అంటూ దాన్ని భార్య చేతిలోంచి లాక్కుని పేపరు పరుచుకుని చూడటం ప్రారంభించాడు.

కామాక్షి అక్కడే నిలబడిపోయింది. ఇద్దరూ కన్నార్పకుండా కుశాల్రావు వంకనే చూస్తున్నారు.

కుశాల్రావు చూస్తున్నాడు ... పది లక్షలు... లేదు ...అయిదు లక్షలు... ఈ నంబరు కాదు. మూడు లక్షలు అసలు కాదు. మిగిలిన ప్రయిజులు...

రెండుక్షణాలు నిశ్శబ్దం ... కామాక్షి ఆత్రుతతో చూస్తున్నది. సూరమ్మ బొమ్మలా నిలబడింది. గాలి లేదు. కుశాల్రావు మొహాన చెమటపడుతున్నది.

కుశాల్రావు జాగ్రత్తగా చూస్తున్నాడు. అన్నిటికన్నా చివరలో టిక్కెట్టు నంబరు చివరి నాలుగంకెలూ కలిస్తే 'వచ్చే' ప్రయిజులున్నాయి. ఉన్నట్టుండి అతని కళ్ళు మెరిశాయి. "కాముడూ! వొచ్చిందే యాభై రూపాయలు." అని కేకపెట్టాడు.

సూరమ్మ పసికళ్ళు మెరిశాయి. కామాక్షి మొహం విప్పారింది. అయినా "ఇంతా చేస్తే యాభై రూపాయలేనా సంబడం. ఏమే అమ్మాయ్! మర్చేపోయాను. ఎండలో వొచ్చావ్. కాసిని మజ్జిగనీళ్లు తాగిపోదువుగాని, ఒక్క క్షణం కూర్చో..." అంటూ లోపలికి వెళ్ళింది.

సూరమ్మ కూర్చోలేదు. అలాగే నిలబడివుంది. లాటరీ టిక్కెట్టును భద్రంగా పట్టుకుని ఈలలేస్తున్న కుశాల్రావు వంకనే చూస్తున్నది. రెండు క్షణాల్లో కామాక్షి లోపలి నుంచి తెచ్చి ఇచ్చిన గ్లాసు అందుకుని నోటి కంటించుకోకుండా గొంతులో పోసుకొని గటగట తాగింది. తర్వాత గ్లాసు గుమ్మంలో వుంచి, మూతి తుడుచుకుని "వెళ్ళొస్తానమ్మగారూ." అంటూ రోడ్డు మీదికి వచ్చింది. కామాక్షి తలుపువేసుకుంటూ "ధర్మం ఈ మాత్రమన్నా ఉండబట్టే

లోకం నిలిచివుంది.” అనుకుంది. కుశాల్రావు ఇంకా హుషారుగా ఈల వేస్తూనే వున్నాడు.

సూరమ్మ దోవలో ఆగి నుదురుతుడుచుకుంది. కాళ్లు కాలుతున్నాయి. పైన నెత్తి మాడుతున్నది. ఆ పిల్ల మనసులో ఎక్కడో ఒక ఊహ...“తొందరపడి తీసుకొచ్చేశాను. ఆ మెకానిక్కునడిగి ముందుగా చూపించివుంటే బాగుండేది.” అనిపించింది. కాని ఆ ఊహ ఎక్కువసేపు మనసులో నిలువలేదు. తండ్రి చేపకావాలన్నాడు. తన దగ్గర పావలా కాసు, ఇంకా గుడిసెలో మరో అయిదారు పైసలూ ఉన్నాయి. సాయంకాలం మెకానిక్కు మరోపావలా యిస్తానన్నాడు.

సూరమ్మ తడికె తోసుకొని లోపలికి వెళ్ళింది. వెంకడు ఇంకా అలాగే పైకప్పువంక చూస్తూ పడుకుని వున్నాడు.

సూరమ్మ హడావిడిగా “అయ్యా ఈపూటకు గంజి తాగు. పచ్చిమిరపకాయ, వుల్లిపాయ ఉంది. రాత్రికి పండుకప్ప తెస్తాలే. మెకానిక్కు ఎంకటేసు డబ్బులిస్తానన్నాడు.” అన్నది.

వెంకడు నవ్వాడు. నవ్వినప్పుడు వాడి తెల్లని పళ్ళు బైటపడ్డాయి.